సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం । 11 । జూన్ । 2024



సోమశిలకు 3,753 క్యూసెక్కుల వరద

సోమశిల: జలాశయానికి 3,753 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. జలాశయంలో సోమవారం సాయంత్రానికి 7.825 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.73,320
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,567
మూడు శాతం జీఎస్టీతో	రూ.6,764
నవర (8 గ్రాములు)	రూ.54,112

గరిష్టం/కనిష్టం
35.6 /26.5

వాతావరణం

వాతావరణంలో తేమ 83 శాతం ఉంది. జిల్లాలో మంగళవారం ఆకాశం పాక్షికంగా మేఘావృతంగా ఉంటుంది. అక్కడక్కడ తేలి కపాటి జల్లులు కురుస్తాయి.

పార్టీ మారితే.. ఫోర్జరీ కేసు కంచికేనా!

- నగరపాలక సంస్థలో మార్ట్‌గేజ్ ఫైల్స్‌లో కమిషనర్ సంతకాలు ఫోర్జరీ
- ఈ వ్యవహారంలో మేయర్ భర్త జయవర్ధన్ ప్రమేయం ఉందన్న ఆరోపణ
- టీడీపీలో చేరాలని, లేదంటే కేసులు తప్పవని బెదిరింపులు
- వెనుక నుంచి నడిపిస్తున్న నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి
- వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేసిన మేయర్ దంపతులు
- కేసుల నుంచి తప్పించుకునేందుకే యూటర్న్

నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రమాణ స్వీకారానికి ముందే కక్ష సాధింపు రాజకీయ క్రీడకు తెర తీశారు. నెల్లూరు మేయర్ దంపతులు వైఎస్సార్‌సీపీ వీడి టీడీపీలో చేరే విధంగా తెర వెనుక కుట్రలకు వ్యూహ రచన చేశారు. నెల్లూరు నగరపాలక సంస్థలో మార్ట్‌గేజ్ ఆస్తులను కమిషనర్ సంతకాలు ఫోర్జరీతో రిలీజ్ చేసిన వ్యవహారంలో మేయర్ పోట్లూరి స్రవంతి భర్త జయవర్ధన్ పాత్రను తెరపైకి తెచ్చారు. మేయర్ దంపతులు పార్టీ మారకపోతే కేసులు నమోదు చేయించి జైలుకు పంపిస్తామని ఎమ్మెల్యే కోటంరెడ్డి బెదిరింపులతో కేసుల భయంతో జయవర్ధన్ నాలుగు రోజులుగా పరారీలో ఉన్నాడు. ఈ క్రమంలో సోమవారం మేయర్ స్రవంతి దంపతులు మీడియా ముందుకు వచ్చి వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తప్పు చేశాం.. క్షమించి అక్కున చేర్చుకోండంటూ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని కోరారు. దీన్ని బట్టి కోటంరెడ్డి బెదిరింపులతో కేసుల నుంచి తప్పించుకునేందుకు యూటర్న్ తీసుకున్నట్లు వైఎస్సార్‌సీపీ వర్గాలు ఆరోపిస్తున్నాయి.

నెల్లూరు (బారకాసు): వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేసిన మేయర్ దంపతులు టీడీపీ కండువా కప్పుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. నెల్లూరు నగర పాలక సంస్థ మేయర్ పదవి గిరిజన మహిళకు రిజర్వేషన్ అయింది. నెల్లూరులోని 54 డివిజన్లలో రెండు డివిజన్లు గిరిజనులకు కేటాయించారు. దీంతో అప్పటి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేగా ఉన్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అనుచరుడిగా ఉన్న పోట్లూరి జయవర్ధన్ భార్య స్రవంతి గిరిజనులకు రిజర్వ్ అయిన 12వ డివిజన్ నుంచి బరిలోకి దింపారు. అప్పటి మంత్రి పోలుబోయిన అనిల్‌కుమార్‌యాదవ్ సహకారంతో ఏకగ్రీవంగా ఎంపిక చేసి, మేయర్ పదవిని సైతం కట్టబెట్టించారు. అయితే శ్రీధర్‌రెడ్డి వైఎస్సార్‌సీపీని వీడి టీడీపీలో చేరిన క్రమంలో మేయర్ స్రవంతి దంపతులు సైతం ఆయన వెంట వెళ్లిపోయారు. అప్పట్లో శ్రీధర్‌రెడ్డితో ఉంటామని బహిరంగంగానే స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో నెల్లూరు నగర పాలక సంస్థలో జరిగిన సమావేశంలో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లుకు. మేయర్‌కు వాగ్వాదం జరిగింది. ఈ సందర్భంగా నెల్లూరు దర్గామిట్ట పోలీస్‌స్టేషన్‌లో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. ఇలా కొన్ని నెలలుపాటు శ్రీధర్‌రెడ్డి వర్గంలోనే ఉన్నారు. ఆ తర్వాత అప్పటి ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని నెల్లూరు రూరల్ నియోజకవర్గానికి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తగా నియమించింది. దీంతో ఆదాల బాధ్యతలు చేపట్టిన తర్వాత మేయర్ దంపతులు తిరిగి వైఎస్సార్‌సీపీ గూటికి చేరారు. తాజాగా మరోసారి మేయర్ దంపతులు వైఎస్సార్‌సీపీ వీడారు. గతంలో ఒకసారి టీడీపీ కండువా కప్పుకున్న వీరు మరోమారు ఆ పార్టీ కండువా కప్పుకోవడం ఖాయంగా స్పష్టమవుతోంది.

మేయర్ భర్తపై ఫోర్జరీ ఆరోపణలు

తాజాగా జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించింది. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యేగా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి గెలుపొందారు. ఈ నేపథ్యంలో నగర పాలక సంస్థలో ఫోర్జరీ వ్యవహారం సంచలనం రేపింది. ఈ ఫోర్జరీ వ్యవహారంలో మేయర్ స్రవంతి భర్త ప్రమేయం ఉందన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో అప్పటి నుంచి మేయర్ భర్త జయవర్ధన్ పరారీలో ఉన్నాడు. నెల్లూరు నగరంలో భవన నిర్మాణాలకు సంబంధించి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ లేకుండానే దాదాపు 70 భవనాలకు సంబంధించిన మార్టిగేజ్ చేసిన ఆస్తులను మాన్యువల్‌గా కమిషనర్ ఇచ్చినట్లుగా ఫోర్జరీ సంతకాలు చేసిన లేఖలతో విడుదల చేయడం జరిగింది. దీంతో ప్రభుత్వానికి రూ.కోట్లు నష్టం చేకూరింది. ఈ విషయంపై ఓ న్యాయవాది నగర పాలక సంస్థ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును పరిశీలించిన కమిషనర్ టౌన్‌ప్లానింగ్ విభాగంలోని బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు ప్రవీణ్, దేవేందర్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. 72 గంటల్లో ఇందుకు సంబంధించి వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు. వీరిచ్చే వివరణతో తదుపరి చర్యలు ఉంటాయని కమిషనర్ స్పష్టం చేశారు. ఆ గడువు సోమవారం సాయంత్రంతో పూర్తి కానున్న నేపథ్యంలో ఈ విషయంపై విచారణ మొదలు కానుంది. విచారణలో వాస్తవాలు బయటకు వస్తే జరిగిన ఫోర్జరీ వ్యవహారంతో తమకెక్కడ ఇబ్బందులు తలెత్తుతాయన్న భయంతోనే మేయర్ దంపతులు యూటర్న్ తీసుకున్నారని వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు ఆరోపిస్తున్నారు. సోమవారం మేయర్ దంపతులు మీడియా సమావేశం ఏర్పాటు చేసి తమకు పార్టీలు ముఖ్యం కాదని తమకు రాజకీయ భిక్ష పెట్టి ఇంతటి గౌరవప్రదమైన పదవిలో ఉండేలా చేసిన వ్యక్తి ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ముఖ్యమన్నారు. తాము తప్పు చేసి వైఎస్సార్‌సీపీలో చేరామని తమని క్షమించి అక్కున చేర్చుకోవాలని ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిని మీడియా ద్వారా కోరుతున్నామన్నారు. ఫోర్జరీ వ్యవహారంపై విలేకర్లు ప్రశ్నించిన దానికి మేయర్ జవాబిస్తూ ఫోర్జరీ వ్యవహారంపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని అధికారులను తాను కోరుతున్నాని, అందులో తన భర్తపై వచ్చిన ఆరోపణలు రుజువైతే తప్పనిసరిగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశిస్తామన్నారు. ఈ క్రమంలోనే మేయర్ భర్త జయవర్ధన్ కూడా స్పందిస్తూ ఫోర్జరీ విషయంలో తనకు ఎలాంటి సంబంధం లేదని ఆ విషయంలో తన ప్రమేయం ఉన్నట్లుగా విచారణలో రుజువైతే ఏశిక్షకై నా తాను సిద్ధంగా ఉంటానని తెలియజేశారు.



మాట్లాడుతున్న మేయర్ పోట్లూరి స్రవంతి, భర్త జయవర్ధన్

రాజీనామాతో ఫోర్జరీ కేసు నీరుగారేనా...

మేయర్ దంపతులు వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేశారు. వీరు టీడీపీలో చేరితో ఫోర్జరీ వ్యవహారం నుంచి తప్పించే అవకాశం ఉంటుందా?. ఈ కేసును కంచికే చేరుతుందా? అనే ప్రచారం జరుగుతోంది. దీంతో ఫోర్జరీ వ్యవహారాన్ని అధికారులు నీరు గార్చినట్లే భావించాల్సి ఉంటుంది. లేకుంటే నిజంగా ఫోర్జరీ జరిగితే అందుకు బాధ్యులపై చర్యలు తీసుకుంటారా? మేయర్ భర్తకు సంబంధం ఉందని రుజువైతే అందుకు బాధ్యులైన ఆయనతో పాటు అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. మరి ఏం జరుగుతుందో వేచి చూడాల్సిందే. ఏదీ ఏమైనా మేయర్ దంపతులు వైఎస్సార్‌పీకి రాజీనామా చేసేందుకు నిర్ణయం తీసుకున్నామనే విషయం నేడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేస్తున్నాం

- నెల్లూరు మేయర్ దంపతులు

నెల్లూరు (బారకాసు): తాను తన భర్త వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నట్లు నెల్లూరు నగర పాలక సంస్థ మేయర్ పోట్లూరి స్రవంతి చెప్పారు. సోమవారం స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయంలోని మేయర్ తన చాంబర్‌లో భర్తతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎలాంటి రాజకీయ నేపథ్యం లేకున్నా తనకు కార్పొరేటర్ టికెట్ ఇప్పించడంతో పాటు ఏకగ్రీవంగా ఎన్నికయ్యేలా చేయడం అనంతరం మేయర్ పదవి కట్టబెట్టిన వ్యక్తి ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అని చెప్పారు. తన భర్త జయవర్ధన్ 15 ఏళ్లుగా స్టూడెంట్ నాయకుడిగా ఉన్నప్పటి నుంచి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అనుచరుడిగా ఆయన అడుగు జాడల్లో కొనసాగుతూ వచ్చారన్నారు. తన భర్త మంచితనం, ఆయన చేసిన సేవలు గుర్తింపు కారణంగానే ఈ రోజు తాను మేయర్ పదవిలో ఉన్నానన్నారు. ఇదంతా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చలువేనని తెలియజేశారు. శ్రీధర్‌రెడ్డి తమ దంపతులను ఆయన కుటుంబ సభ్యులుగా చూసుకున్నారన్నారు. కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వైఎస్సార్‌సీపీని వీడినప్పుడు కూడా తాము మాత్రం శ్రీధర్‌రెడ్డిని వీడేది లేదని ఆ నాడు మీడియా సమావేశంలో చెప్పడం జరిగిందని గుర్తు చేశారు. అయితే అధికారంలో ఉన్న వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు తమను బలవంతం చేయడం వల్లనే తప్పని పరిస్థితుల్లో తాము శ్రీధర్‌రెడ్డిని వీడి వైఎస్సార్‌సీపీలో చేరడం జరిగిందని తెలియజేశారు. తాము రాజకీయంగా శ్రీధర్‌రెడ్డిని వీడామే తప్ప మానసికంగా ఆయనతోనే ఉన్నామని స్పష్టం చేశారు. కాగా, మేయర్ దంపతులను పార్టీలో చేర్చుకునేది లేదని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రకటించడం కొసమెరుపు.

న్యూస్‌రీల్

కిలో పొగాకు గరిష్ట ధర రూ. 330

కలిగిరి: కలిగిరి పొగాకు వేలం కేంద్రంలో సోమవారం కిలో పొగాకు గరిష్ట ధర రూ.330 లభించింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 703 పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకు రాగా 545 పొగాకు బేళ్లను కొనుగోలు చేశారు. 158 బేళ్లను వివిధ కారణాలతో కొనుగోలు తిరస్కరించారు. వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ మాట్లాడుతూ కిలో పొగాకుకు గరిష్టంగా రూ.330, కనిష్టంగా రూ. 205 ధర లభించగా, సగటున రూ.287.26 లభించిందన్నారు. వేలంలో 16 కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు.

సొసైటీ అధ్యక్ష పదవికి గుంటుపల్లి రాజీనామా



సీఈఓకు రాజీనామా లేఖను అందిస్తున్న గుంటుపల్లి

వరికుంటపాడు: వరికుంటపాడు సొసైటీ అధ్యక్షుడిగా పని చేస్తున్న గుంటుపల్లి రామాంజనేయులు సోమవారం అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం సొసైటీ కార్యాలయంలో తన రాజీనామా పత్రాన్ని సొసైటీ సీఈఓ రత్తయ్యకు అందించారు. ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత కారణాలతో అధ్యక్ష పదవికి రాజీనామా చేసినట్లు ఆయన తెలిపారు.

పీఏసీఎస్ అధ్యక్షుడి రాజీనామా

ఇందుకూరుపేట : మండలంలోని నిడుముసలి పీఏసీఎస్ అధ్యక్షుడు కొండ్లపూడి శ్రీనివాసులు రెడ్డి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని సొసైటీ సీఈఓ ప్రతాప్‌కుమార్‌రెడ్డికి అందజేశారు. వైఎస్సార్‌సీపీ ఓటమి చెందడంతో తాను రాజీనామా చేసినట్లు శ్రీనివాసులు రెడ్డి వివరించారు.

పుట్టి ధాన్యం రూ.27 వేలు

- పొట్టింపాడులో ధాన్యం నిల్వలు



పొట్టింపాడులో ధాన్యం నిల్వ చేసిన దృశ్యం

ముత్తుకూరు: గతేడాది రబీ సీజన్‌లో పండించి నిల్వ ఉంచిన వరి ధాన్యం ధర క్రమంగా పెరిగింది. కోతల దశలో పుట్టి రూ.21 వేల పైగా ధర పలికిన జిలకర మసూర ధాన్యం ప్రస్తుతం రూ.27,000లకు పెరిగింది. ముత్తుకూరు మండలంలో రబీ సీజన్‌లో 8,918 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఒక ఎకరాకు రూ.25,000 నుంచి రూ 30,000 వరకు పెట్టుబడి పెట్టి సాగు చేశారు. ఎకరాకు 4.5 పుట్ల ధాన్యం దిగుబడి రావడంతో రైతులు సంతోష పడ్డారు. అవసరాల నేపథ్యంలో చాలా మంది రైతులు అప్పటి ధరలకు ధాన్యం అమ్మకాలు చేశారు. అయితే గిడ్డంగుల సౌకర్యం కలిగిన పొట్టింపాడు తదితర గ్రామాల్లో రైతులు ధాన్యం భద్రపరుచుకున్నారు. ప్రస్తుతం ఈ జిలకర మసూర ధాన్యానికి మంచి గిరాకీ ఏర్పడింది. పుట్టి సుమారు రూ. 27,000 లకు పెరగడంతో ఈ గ్రామ రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఒక్క పొట్టింపాడు గ్రామంలోనే సుమారు 3,000 పుట్ల ధాన్యం నిల్వ ఉన్నట్టు అంచనా. ప్రస్తుతం ఉన్న ధరలు మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు భావిస్తున్నారు.

ప్రమాణస్వీకారం వీక్షించేందుకు ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు

- జిల్లా నుంచి గన్నవరం వెళ్లేందుకు 32 ఆర్టీసీ బస్సులు
- అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు విద్యుత్ లైటింగ్
- జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): విజయవాడ సమీపంలోని గన్నవరం కేసరపల్లి ఐటీ పార్కు వద్ద ఈ నెల 12న నిర్వహించనున్న చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని జిల్లా నుంచి ప్రజలు వీక్షించేందుకు 11 ప్రదేశాల్లో ఎల్‌ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ వికాస్‌మర్మత్ అన్నారు. సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వికాస్‌మర్మత్ మాట్లాడుతూ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని లైవ్ స్ట్రీమింగ్ ద్వారా వీక్షించేందుకు నెల్లూరు నగరంలో 4, నియోజకవర్గ కేంద్రాల్లో ఎంపిక చేసిన ప్రదేశంలో ఒక్కో ఎల్‌ఈడీ స్క్రీన్‌ను ఏర్పాటు చేయాలని, మండపాల్లో తాగు నీరు, స్నాక్స్ అందించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 11 ప్రదేశాల్లో ఈ లైవ్ స్ట్రీమింగ్ ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. అలాగే ప్రమాణ స్వీకార కార్యక్రమానికి తరలి వెళ్లేందుకు జిల్లాలో ఎంపిక చేసిన ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సులు బయలుదేరనున్నట్లు చెప్పారు. ఒక్కొక్క నియోజకవర్గానికి నాలుగు ఆర్టీసీ బస్సుల చొప్పున జిల్లాలో 32 బస్సులు కేటాయించామని, 11వ తేదీ రాత్రి 10 గంటలకల్లా బస్సులు బయలుదేరేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారు లకు సూచించారు. ప్రతి బస్సుకు ఒక ఇన్‌చార్జిని నియమించాలన్నారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సేతుమాధవన్, డీఆర్‌ఓ లవన్న, డీఆర్‌డీఏ, డ్వామా పీడీలు సాంబశివారెడ్డి, వెంకట్రావు, ఆర్టీసీ ఆర్‌ఎం శేషయ్య, ఎంపీడీఓలు, తహశిల్దార్లు పాల్గొన్నారు.

సొసైటీ త్రీమెన్ కమిటీ సభ్యులు రాజీనామా

సీతారామపురం: మండలంలోని మారంరెడ్డిపల్లి పీఏసీఎస్ త్రీమెన్ కమిటీ సభ్యులు సోమవారం తమ పదవులకు రాజీనామా చేశారు. రాజీనామా లేఖలను సొసైటీ సీఈఓ శ్రీనివాసులుకు అందజేశారు. వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. ఎన్ని బాధలు, ఇబ్బందులు కలిగినా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మేకపాటి రాజగోపాల్‌రెడ్డి వెంటే ఉండి పార్టీ కోసం పోరాడుతామని స్పష్టం చేశారు. తమకు సహకరించిన అధికారులు, సిబ్బంది, రైతులకు త్రీమెన్ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. వాస్తవంగా వీరి పదవీ కాలం ఈ ఏడాది జూలై 31 వరకు ఉంది. సార్వత్రిక ఎన్నికల ఫలితాల నేపథ్యంలో గత ప్రభుత్వం భర్తీ చేసిన నామినేటెడ్ పోస్టుల నుంచి తప్పుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ కావడంతో వారు రాజీనామాలు సమర్పించారు.



రాజీనామా లేఖలను సీఈఓకు అందజేస్తున్న త్రీమెన్ కమిటీ సభ్యులు

టపాసుల గోడౌన్‌లో అగ్నిప్రమాదం

- ఒక బాలుడు సహా, ముగ్గురికి గాయాలు
- బాలుడి పరిస్థితి విషమం

బిట్రగుంట: బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ ఇబ్రహీంపేట సమీపంలోని సుమంత్ ఫైర్ వర్క్స్‌కు చెందిన టపాసుల గోడౌన్‌లో సోమవారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. గోడౌన్‌లో విద్యుత్ వైరింగ్‌కు సంబంధించిన మరమ్మతు పనులు చేస్తుండగా షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగడంతో టపాసులు అంటుకుని ప్రమాదం సంభవించినట్లు తెలుస్తుంది. ఈ ప్రమాదంలో కప్పరాళ్లతిప్పకు చెందిన 13 ఏళ్ల బాలుడు పీట్ల సురేష్ రేనా తీవ్రంగా గాయపడగా, గోడౌన్ యజమాని సుమంత్, అతని తండ్రి నాగేశ్వరరావు స్వల్పంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు బోగోలుకు చెందిన మాదినేని సుమంత్ విశ్వనాథరావుపేట పంచాయతీ ఇబ్రహీంపేటలోని ఓ లేఅవుట్‌లో కొద్ది సంవత్సరాలుగా టపాసుల గోడౌన్ నిర్వహిస్తున్నాడు. దీపావళి సమయంలోనే కాకుండా మిగిలిన రోజుల్లో కూడా టపాసుల విక్రయాలు జరుగుతుంటాయి. ఈ క్రమంలో గోడౌన్‌లో విద్యుత్ వైరింగ్‌కు సంబంధించి సోమవారం సాయంత్రం మరమ్మతులు చేయిస్తుండగా షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు చెలరేగాయి. నిప్పురవ్వలు టపాసులపై పడడంతో క్షణాల వ్యవధిలోనే పేలుడు సంభవించింది. పేలుడు ధాటికి గోడౌన్ పూర్తిగా ధ్వంసం కావడంతో పాటు సమీపంలోని ప్రహరీ కూడా ధ్వంసమైంది. పేలుడు కారణంగా దుకాణంలో పని చేస్తున్న బాలుడు పీట్ల సురేష్ రేనాతో పాటు యజమాని సుమంత్, అతని తండ్రి నాగేశ్వరరావు గాయపడ్డారు. వీరిలో పీట్ల సురేష్ రేనా తీవ్రంగా గాయపడడంతో హుటాహుటిన కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. సుమారు 75 శాతం పైన కాలిపోవడంతో బాలుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. కావలి నుంచి వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. కావలి రూరల్ సీఐ నాగభూషణం, బిట్రగుంట ఎస్సై భోజ్యాలు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



విశ్వనాథరావుపేట పంచాయతీ ఇబ్రహీంపేట సమీపంలో అగ్నికి ఆహుతవుతున్న టపాసుల గోడౌన్

వైద్యశాఖలో ఉద్యోగాల పేరుతో మోసం?

నెల్లూరు (అర్బన్): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో అల్లీపురం పీహెచ్‌సీలో పని చేసిన ఒక జూనియర్ అసిస్టెంట్ కాంట్రాక్ట్ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ పలువురి దగ్గర లక్షలాది రూపాయలు వసూలు చేసినట్టు తెలుస్తోంది. గతంలో వైద్యశాఖలో వరుసగా ఎంఎల్‌హెచ్‌పీలు, నర్సింగ్ పోస్టులకు కాంట్రాక్ట్ పద్ధతిలో రిక్రూట్‌మెంట్‌లు జరిగాయి. అయితే సదరు జూనియర్ అసిస్టెంట్ నాయుడుపేట డివిజన్‌కు చెందిన పలువురికి వైద్యశాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసినట్టు సమాచారం. కొత్తగా ఏర్పడిన తిరుపతి జిల్లా పరిధిలో నాయుడుపేట ఉన్నప్పటికీ రిక్రూట్‌మెంట్ మాత్రం నెల్లూరు జిల్లా వైద్యశాఖ పరిధిలోనే జరిగాయి. కొత్తగా జిల్లా ఏర్పడడం, పోస్టులు ఉండడంతో ఆ ప్రాంతానికి చెందిన కొంత మంది నిరుద్యోగులను ఉద్యోగాల పేరుతో ఆ జూనియర్ అసిస్టెంట్ మోసం చేసినట్టు తెలుస్తోంది. అయితే ఈ విషయమై డీఎంహెచ్‌ఓ పెంచలయ్యను వివరణ కోరగా ఇదంతా ఫేక్ అని కొట్టిపారేశారు. రిక్రూట్ మెంట్‌లో ఎలాంటి అవకతవకలు కూడా జరగలేదని వివరించారు. ఇదిలా ఉండగా గతంలో రిక్రూట్‌మెంట్‌ల సందర్భంగా పలువురు దొంగ సర్టిఫికెట్‌లు పెట్టి ఇంటర్వ్యూలకు సైతం హాజరయ్యారు. ఈ విషయాలను వైద్య శాఖ అధికారులు స్వయంగా పసిగట్టి అలాంటి వారిని మందలించారు. ఇలాంటి ఉదాహరణలు పరిశీలిస్తే వైద్యశాఖలో కొంత మంది ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులను మోసం చేస్తున్నారనే విషయం తెలుస్తోంది.

క్లుప్తంగా

ఆవులను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

• ఆరు మూగజీవాల మృతి



మృతిచెందిన ఆవు

మర్రిపాడు: రోడ్డు ప్రమాదంలో ఆరు అడవి ఆవులు మృతిచెందిన ఘటన మండలంలోని రాజుపాళెం సమీపంలో నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై సోమవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆర్టీసీ బస్సు జమ్మలమడుగు నుంచి నెల్లూరుకు వెళ్తోంది. ఈ సమయంలో ఆవుల గుంపు అడ్డుగా రావడంతో బస్సు ఢీకొంది. దీంతో ఆరు ఆవులు అక్కడికక్కడే చనిపోయాయి.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



నెల్లూరు సిటీ: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం అర్ధ రాత్రి జరిగింది. రైల్వే పోలీసుల కథనం మేరకు.. వేదాయపాళెం – నెల్లూరు రైల్వేస్టేషన్ల మధ్య సౌత్ రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తిని రైలు ఢీకొంది. దీంతో తీవ్రగాయాలై అక్కడికక్కడ మృతిచెందాడు. మృతుడి ఎడమవైపు ఛాతిపై ప్రభాస్ అని పచ్చబొట్టు ఉంది. ఎరుపు రంగు టీ షర్ట్, తెలుపు, నీలం రంగు గీతలున్న లుంగీ ధరించి ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొందా? లేక ఆత్మహత్య చేసుకున్నాడా?, లేక రైల్లో వెళ్తూ కింద పడి చనిపోయాడా అని తెలుసుకునే పనిలో ఉన్నారు.

సిమెంట్ ట్యాంకర్ బోల్తా



సంగం: మండల కేంద్రమైన సంగం సమీపంలో కొండమలుపు వద్ద సోమవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. నెల్లూరు వైపు నుంచి ఆత్మకూరు వైపు వెళ్తున్న సిమెంట్ ట్యాంకర్ మోటార్‌బైక్‌ను తప్పించబోయి గేదెలతోపాటు ప్రమాదవశాత్తు కారు వెనుక భాగంలో ఢీకొట్టి రోడ్డు పక్కన గుంతలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్యాంకర్ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఒక గేదెకు తీవ్ర గాయాలు కాగా మరొకటి మృతిచెందింది. సమాచారం అందుకున్న ఎస్సై నాగార్జునరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వృద్ధురాలి అదృశ్యం

నెల్లూరు సిటీ: వృద్ధురాలు కనిపించడం లేదని సోమవారం పోలీసులకు రూరల్ ఫిర్యాదు అందింది. వారి కథనం మేరకు.. తిరుమలశెట్టి పాపమ్మ (74) రూరల్ మండలంలోని పెదచెరుకూరు గ్రామంలో తన కుమారుని వద్ద ఉంటోంది. ఈనెల 7వ తేదీన గుడికి వెళ్లింది. ఆమె తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు సమీప ప్రాంతాల్లో వెతికారు. నవాబుపేటలోని పెట్రోల్ బంకు వద్ద నుడుచుకుంటూ వెళ్తుంటే చూసినట్లు స్థానికులు తెలిపారు. ఈ క్రమంలో రూరల్ పోలీసులకు కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని..

• చుక్కలదుప్పి మృతి



దుత్తలూరు: ఆర్టీసీ బస్సు ఢీకొన్ని చుక్కలదుప్పి మృతిచెందిన ఘటన మండలంలోని కట్టకిందపల్లి సమీపంలో సోమవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. ఆర్టీసీ బస్సు పామూరు నుంచి నెల్లూరుకు వెళ్తోంది. అకస్మాత్తుగా చుక్కలదుప్పి రోడ్డుపైకి రావడంతో బస్సు ఢీకొనడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. అటవీ అధికారులకు సమాచారం అందించడంతో డీఆర్వో ప్రసాద్ తన సిబ్బందితో వచ్చి శవపంచనామా నిర్వహించి దహనం చేశారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 160
లేయర్ (లైవ్)	: 120
బ్రాయిలర్ చికెన్	: 280
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 310
లేయర్ చికెన్	: 204

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.80
సన్నవి	: రూ.50
పండ్లు	: రూ.35



బంగినపల్లికి భలే గిరాకీ

• హైదరాబాద్ నుంచి భారీగా కొనుగోలుదారుల రాక
• సంతోషంగా రైతులు

ఉలవపాడు: ప్రపంచంలోనే పేరుగాంచిన ఉలవపాడు బంగినపల్లి మామిడికి రోజురోజుకూ డిమాండ్ పెరుగుతోంది. నాలుగు రోజులుగా హైదరాబాద్ నుంచి కొనుగోలుదారులు ఉలవపాడు ప్రాంతానికి అధికంగా తరలి వస్తున్నారు. బంగినపల్లి రకం కోసం రైతులు, దళారులను ఆశ్రయిస్తున్నారు.

ఈ ఏడాది మామిడి దిగుబడి తక్కువగా ఉంది. ఈ తరుణంలో కొనుగోలుదారులు ఎక్కువ ధరను చెల్లించి కొనుగోలు చేస్తున్న పరిస్థితులున్నాయి. దీంతో వారం రోజుల క్రితం రూ.40 వేలలోపున్న టన్ను బంగినపల్లి ఇప్పుడు రూ.60 వేలకు చేరింది. కవర్లు కట్టిన కాయలైతే రూ.90 వేల నుంచి రూ.లక్ష వరకు పలుకుతున్నాయి. అయితే కొనుగోలుదారులకు పూర్తిస్థాయిలో అందించే పరిస్థితి లేదు. గతంలో దళారులు పంపించేవారు. అయితే ప్రస్తుతం హైదరాబాద్ నుంచి నేరుగా కొనుగోలుదారులే వచ్చి కాయల కోసం తోటల వెంట తిరుగుతున్నారు.

ధరలతో ఆనందం

ప్రస్తుతం బంగినపల్లి రకానికి ధరలు బాగున్నాయి. దీంతో రైతుల్లో ఆనందం నెలకొంది. కాయలను తోటల్లోనే కోసి ప్యాకింగ్ చేసి లారీలు, ట్రక్కుల్లో తరలిస్తున్నారు. బయట మార్కెట్లో సైతం ఈ రకం కిలో రూ.80 నుంచి రూ.100 వరకు పలుకుతోంది. కవర్లు కట్టిన వాటినైతే కిలో రూ.150కు పైనే విక్రయిస్తున్నారు.



మామిడి కాయలను ప్యాకింగ్ చేస్తున్న కూలీలు

వీటికి డిమాండ్

పండుఈగ సోకకుండా ఫ్రూట్ కవర్లు కట్టిన మామిడికి ప్రస్తుతం బాగా డిమాండ్ ఉంది. కవర్లు కట్టిన వాటిలో చిన్న మచ్చ కూడా ఉండదు. కాయలోపల పురుగు సోకే అవకాశం ఉండదు. నాణ్యత బాగుంటుంది. బంగినపల్లి రకానికి చెందిన ఈ కాయలను తీసుకెళ్లేందుకు కొనుగోలుదారులు పోటీ పడుతున్నారు. వారం రోజుల్లో హైదరాబాద్ వ్యాపారుల కారణంగా



ఉలవపాడు ప్రాంతంలో బంగినపల్లి మామిడికి డిమాండ్ పెరిగింది.

చెన్నై వాసి బలవన్మరణం

వెంకటాచలం: ఫ్యాన్‌కు ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని చెముడుగుంట పంచాయతీ పరిధిలో సోమవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. చెన్నైకి చెందిన రామ్మూర్తి సురేష్‌కుమార్ (38) ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. కొంతకాలంగా వెంకటాచలం మండలం చెముడుగుంట పెట్రోల్ బంకు సమీపంలో ఉన్న గణపతి ప్లాజా అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నాడు. సోమవారం సాయంత్రంలో తన ఫ్లాట్‌లో ఉరేసుకున్నాడు. సురేష్‌కుమార్ గదిలో నుంచి బయటకు రాకపోవడంతో భార్య వర్ష ఆందోళన చెందింది. తలుపు కొట్టినా తీయకపోవడంతో చుట్టుపక్కన వారి సాయం తీసుకుంది. అందరూ కలిసి తలుపులు పగులగొట్టి చూడగా సురేష్ ఉరేసుకుని ఉన్నాడు. దీంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా రోదించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సురేష్‌కుమార్ ఆత్మహత్యకు గల కారణాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.



సురేష్‌కుమార్ మృతదేహం

బైక్ అపహరణ కేసులో ముగ్గురి అరెస్ట్

తడ: దారి కాచి, కత్తి ఉందని బెదిరించి మోటార్ బైక్‌ను అపహరించిన కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై పి.నరసింహారావు సోమవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. వరదయ్యపాళెం మండలం పులివెల్లం గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు శనివారం రాత్రి బైక్‌పై మాంబట్టు సెజ్‌లోని ఓ ప్రైవేటు పరిశ్రమలో విధులకు వెళ్తున్నారు. అదే సమయంలో మాంబట్టు వద్ద కొందరు వ్యక్తులు వారిని కత్తితో బెదిరించారు. దీంతో యువకులు బైక్ వదిలిపెట్టి భయంతో పరుగులు తీశారు. నిందితులు బైక్‌ను అపహరించుకెళ్లారు. దీనిపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సోమవారం కాదలూరు గ్రామ కూడలి వద్దనున్న జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో తడ మండలం వెండ్లూరుపాడు గ్రామానికి చెందిన బూరగ తేజ, సూళ్లూరుపేట పట్టణంలోని కావలి వీధికి చెందిన వరుణ్ ముకేష్, సూళ్లూరుకు చెందిన మీజూరు దినేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మత్స్యకారులకు గుర్తింపుకార్డులు

చిల్లకూరు: సముద్రంలో చేపల వేటపై నిషేధం విధించిన విషయం తెలిసిందే. ఇది త్వరలో ముగియనుంది. ఈ క్రమంలో మత్స్యకారులు తిరిగి వేట కొనసాగించుకునేందుకు అవసరమైన చర్యలను అధికారులు చేపట్టారు. వారు సోమవారం తీర ప్రాంతంలోని పలు మత్స్యకార గ్రామాల్లో పర్యటించారు. పడవలు ఉన్న యజమానులను గుర్తించి వారికి గతంలో ఇచ్చిన గుర్తింపుకార్డులు, డీజిల్ రాయితీ కార్డులను రెన్యువల్ చేయడంపై అవగాహన కల్పించారు. మత్స్యకారులు గతంలో భద్రపరుచుకున్న పడవల పరిస్థితి, వలల పటుత్వంపై దృష్టి పెట్టారు. ఈనెల 15న వేటకు సర్వసిద్ధం చేసేలా చూస్తున్నట్లు మత్స్యశాఖాధికారి రఘుబాబు తెలిపారు.

ఈజీ పేమెంట్

ఇంట్లో నుంచి బయటకు వెళ్తున్నారా?.. జేబులో చిల్లిగవ్వ లేకపోయినా సరే.. స్మార్ట్ ఫోన్ ఉంటే చాలు.. కావాల్సిన వస్తువులు కొనుగోలు చేయొచ్చు. నచ్చిన ఫుడ్ తినొచ్చు.. గతంలో మాల్స్, వ్యాపార సంస్థలకే పరిమితమైన డిజిటల్ పేమెంట్స్ చిరు వ్యాపారుల చెంతకు సైతం చేరాయి. నగదు లావాదేవీలు తగ్గుతుండగా.. ఎక్కడ చూసినా యాప్స్ ద్వారా చెల్లింపులే కనిపిస్తున్నాయి.

• నగదు లావాదేవీలకు క్రమంగా చెల్లుచీటీ
• ఆన్‌లైన్ యాప్స్ ద్వారా చెల్లింపులకు మొగ్గు

కోవూరు: ప్రస్తుతం డిజిటల్ పేమెంట్స్ చేసేవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. కొన్నేళ్ల క్రితం పెద్దగా ప్రజలు ఆసక్తి చూపించేవారు కాదు. మాల్స్, పెద్ద వ్యాపార సంస్థల్లో మాత్రమే పేమెంట్ యాప్స్, క్రెడిట్, డెబిట్ కార్డులతో చెల్లింపులు కనిపించేవి. నగదు వేరే వారి ఖాతాల్లోకి వెళ్లిపోతుందన్న ఆపోహలు, సైబర్ మోసాలు జరుగుతాయన్న ఆందోళనతో గ్రామాల్లో వీటి జాడ పెద్దగా కనిపించేది కాదు. కోవిడ్ అనంతర పరిణామాలతో నగదు రహిత లావాదేవీలు పెరిగాయి. ప్రస్తుతం ఎక్కడ చూసినా ఆన్‌లైన్ చెల్లింపులే.. ఫోన్‌పే, గూగుల్ పే. పేటీఎం, అమెజాన్ పే, క్రెడ్ తదితర యాప్‌ల ద్వారా ఆన్‌లైన్ చెల్లింపులు చేస్తున్నారు. కిరాణా, ఫ్యాన్సీ, మందులు, పెట్రోల్ బంకులు, ఇతర నిత్యావసర వస్తువుల దుకాణాలతోపాటు మొబైల్, డీటీహెచ్ రీచార్జీలు, విద్యుత్, గ్యాస్ బిల్లుల చెల్లింపులు చాలావరకూ ఈ యాప్స్ ద్వారానే జరుగుతున్నాయి.



దుకాణంలో ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ బోర్డు

డిజిటల్ బ్యాంకింగ్‌కు ప్రాధాన్యం

అనేకమంది డిజిటల్ బ్యాంకింగ్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో నగదు లావాదేవీలు చాలావరకూ తగ్గిపోయాయి. వినియోగదారులు అధికంగా క్యాష్‌లెస్ లావాదేవీలు చేస్తూ ఇంటి వద్ద నుంచే అన్ని రకాల సేవలు పొందుతున్నారు. దీంతో బ్యాంకులకు వచ్చే ఖాతాదారుల సంఖ్య తగ్గింది. మరోవైపు రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా డిజిటల్ పేమెంట్స్‌ను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటోంది.

Paytm Google Pay PhonePe

సులువుగా..

టీ స్టాళ్లు, చిన్న హోటళ్లు, తోపుడు బండ్లు, రోడ్ల పక్కన, ఇంటింటికీ తిరుగుతూ ఫాస్ట్‌ఫుడ్, కూరగాయలు, పండ్లు వంటివి అమ్మే వారికి ఈ ఆన్‌లైన్ చెల్లింపులు ప్రయోజనకరంగా మారాయి. ప్రధానంగా చిల్లర సమస్యతో వీరికి బేరాలు పోతుంటాయి. డిజిటల్ పేమెంట్స్ కారణంగా అని చిల్లర సమస్య తీరుతుండడంతో చిరు వ్యాపారులు సైతం వీటి వైపు మొగ్గు చూపుతున్నారు. పేమెంట్‌కు సంబంధించిన క్యూఆర్ కోడ్లను ఆయా సంస్థల ఏజెంట్లు అందజేస్తున్నారు. ఇప్పుడు ఏ దుకాణం వద్ద చూసిన క్యూఆర్ కోడ్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. గతంతో పోలిస్తే చాలావరకు వినియోగదారులు ఆన్‌లైన్‌లో పేమెంట్ చేసేందుకే ఆసక్తి చూపిస్తున్నారని వ్యాపారులు అంటున్నారు. కాగా వీటిని అడ్డం పెట్టుకుని కొందరు కేటుగాళ్లు మోసాలకు పాల్పడ్డారు. వీటికి చెక్ పెట్టేందుకు క్యూఆర్ కోడ్ బోర్డులకు స్పీకర్ బాక్స్‌లు పెట్టారు. ఆన్‌లైన్ చెల్లింపు జరగ్గానే ఎంత మొత్తం దుకాణదారు బ్యాంక్ ఖాతాకు జమైందో వాయిస్ రూపంలో వినిపిస్తుంది. దీంతో మోసాలకు అడ్డుకట్ట పడింది.

ఈ విధానం బాగుంది

డిజిటల్ పేమెంట్ ద్వారా బ్యాంకులకు వెళ్లకుండా సమయం ఆదా అవుతుంది. ఈ విధానం బాగుంది. చేతిలో డబ్బులు లేకున్నా బ్యాంక్ ఖాతాలో డబ్బులుంటే వస్తువులు కొనుగోలు చేయొచ్చు. ఒక్క రూపాయి నుంచి ఎంత వరకైనా ఫోన్ పే గూగుల్ పే తదితర యాప్స్ ద్వారా చెల్లించవచ్చు.
– అవినాష్, పడుగుపాడు

ఏపీ హంస నూతన కార్యవర్గం

సైదాపురం: ఏపీ హంస సర్వసభ్య సమావేశాన్ని రాష్ట్ర అధ్యక్షుడు అరవ పాల్ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్ అధ్యక్షతన మండల కేంద్రమైన సైదాపురంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ అసోసియేషన్ గూడూరు తాలూకా అధ్యక్షురాలిగా జోగి పద్మ, అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా కె.శ్రీహరి, సెక్రటరీగా సుజిత్‌కుమార్, ట్రెజరర్‌గా వి.సుప్రజ, ఆర్గనైజింగ్ సెక్రటరీగా విజయలక్ష్మి, పబ్లిసిటీ సెక్రటరీగా అబీదా, ఉపాధ్యక్షులుగా అనూష, జ్యోతి, అరుణ, పెంచలసుబ్బయ్య, శేషమ్మ, మహిళా విభాగం సెక్రటరీగా ఆదిలక్ష్మి, జాయింగ్ సెక్రటరీగా శ్రీనివాసులు, రాజేష్ నియమితులయ్యారు. జిల్లా ట్రెజరర్ ఎండీ మజహరుల్లా, టి.రాజయ్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సుధీకర్‌రావు మాట్లాడుతూ వైద్య, ఆరోగ్యశాఖ గుర్తింపు పొందిన మొదటి యూనియన్ తమదేనన్నారు. నిజాయతీగా సేవలందించే ఉద్యోగులను మాత్రమే ఆహ్వానిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యులు జనార్దనరావు, శ్రావణి పాల్గొన్నారు.



నూతన కార్యవర్గంలో జిల్లా యూనియన్ నాయకులు

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

నెల్లూరు సిటీ: ఓ వ్యక్తి రైలు కింద పడి బలవనర్మరణానికి పాల్పడిన ఘటన సోమవారం ఉదయం జరిగింది. రైల్వే పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. మధుసూదన్‌రావు (55) పొదలకూరు మండలంలో నివాసం ఉంటున్నాడు. కుదువ వ్యాపారం చేసేవాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. నెల్లూరులో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని కుటుంబసభ్యులకు విషయాన్ని తెలియజేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

సిద్ధిలేశ్వరకోనలో గల్లంతైన విద్యార్థి మృతి

రాపూరు: రాపూరు – చిట్వేలి రోడ్డులోని సిద్ధిలేశ్వరకోన గుండంలో ఆదివారం గల్లంగైన విద్యార్థి మహేంద్ర (18) మృతదేహం సోమవారం బయటపడింది. ఎస్సై మాల్యాద్రి విలేకరులకు వివరాలు వెల్లడించారు. నెల్లూరు నగరం మూడో మైలుకు చెందిన కొటారు సురేష్ కుమారుడు మహేంద్ర ఇంటర్మీడియట్ చదివాడు. ఆదివారం అతను గ్రామానికి చెందిన దుశాంత్, సంతోష్, హరిహరన్, సయ్యద్ కైఫ్‌తో కలిసి రాపూరు మండలం వెలుగొండల్లోని సిద్ధిలేశ్వరకోనకు వచ్చాడు. జలపాతం వద్ద ఉన్న నీటిగుండంలో ఈత కొడుతూ మునిగిపోయాడు. మిత్రులు రాపూరు పోలీసులకు సమాచారం అందించడంతో వారు గజఈతగాళ్లు, ఫైర్ సిబ్బంది చేత గాలింపు చేపట్టారు. చీకటి పడడంతో సోమవారం ఉదయం మరోసారి గాలింపు చర్యలు చేపట్టగా మహేంద్ర మృతదేహం కనిపించింది. బాధిత తండ్రి సురేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు వివరించారు.



మహేంద్ర మృతదేహం

కండలేరులో 6.506 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 6.506 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 15 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 40, లోలెవల్ కాలువకు 70 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బీసీజీ టీకాను వేయించుకోండి

రాపూరు: మండలంలో 60 సంవత్సరాలోపు వయసున్న వారు బీసీజీ టీకాను వేయించుకోవాలని డాక్టర్ సుదర్శనమ్మ తెలిపారు. స్థానిక ఎమ్మార్సీ వద్ద సోమవారం బీసీజీ టీకాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయవ్యాధి నిర్మూలనకు బీసీజీ టీకాను వేస్తున్నట్లు చెప్పారు. మండలంలో 10 వేల మందికి ఈ వ్యాక్సిన్ వేయనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ క్షయవ్యాధి నిర్మూలనకు సహకరించి ఈ వ్యాక్సిన్ వేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది అబ్దుల్, సుప్రజ, కాంతమ్మ, హరిత, సురేఖ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సదర్శనమ్మ